క్లుప్తంగా

3రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ వాటర్ ప్లాంట్ వద్ద మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఈనెల 28, మార్చి 1, 2వ తేదీల్లో వరంగల్ అండర్ రైల్వేగేట్ జోన్‌లో తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ బీఎల్.శ్రీనివాస్ రావు తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంట్ వద్ద 60 ఎంఎల్‌డీ పైపులైన్లకు అనుసంధాన పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యాధి నిరోధక శక్తి పెంపు



హసన్‌పర్తి: నట్టల నివారణ మందుతో మూగజీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. 56వ డివిజన్ హసన్‌పర్తిలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ జీవాల ఆరోగ్యానికి, పునరుత్పత్తికి నట్టల నివారణ మందు ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆ కళాశాలలపై చర్య తీసుకోవాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించటం లేదని, ఈక్రమంలో అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సీడీసీడీన్ ప్రొఫెసర్ రాచంద్రంకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, బాలకృష్ణ, ప్రేమ్, యాదగిరి, పవన్‌కళ్యాణ్, కృపమని, మానస, నాగజ్యోతి, సుష్మ, సరిత, సుకన్న పాల్గొన్నారు.

వర్సిటీ లా కళాశాలలో మంటలు



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాల వెనుకభాగంలో మంటలు చెలరేగాయి. చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు ఎగిసిపడినట్లు తెలుస్తోంది. కళాశాల వెనుక భాగంలో చెత్తాచెదారం, ఎండిపోయిన పిచ్చిమొక్కలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెత్తను కాల్చుతుండగా మంటలు వ్యాపించగా, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. అక్కడి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

షైన్‌లో 'ఐ విల్ టీచ్ మై లెసన్'



హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని షైన్ స్కూల్‌లో ప్రీప్రైమరీ విద్యార్థులు ఐ విల్ టీచ్ మై లెసన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎగ్జిబిట్లు ప్రదర్శించి వాటి గురించి విపులంగా వివరించారు. జనరల్ నాలెడ్జ్, కన్వర్షేషన్, స్టోరీ టెల్లింగ్, స్టేట్ అంట్ క్యాపిటల్స్ వంటి అనేక విషయాలను బుజ్జిబుజ్జి మాటలతో వివరించిన తీరు ఆకట్టుకుంది. సుమారు 150 ప్రాజెక్టులు ప్రదర్శించి వాటి గురించి విపులీకరించారు. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, ప్రీ స్కూల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మూగల రమ మాట్లాడుతూ చిన్నారుల్లో భయాన్ని పోగొట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ప్రగతిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రజావాణికి వినతులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణికి ఆరు వినతులు వచ్చాయి. వీటిలో డబుల్ బెడ్రూమ్ ఇల్లు, వ్యక్తిగత రుణాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ట్రేడ్ లైసెన్సుపై ఉన్నాయి. జిల్లా సంక్షేమ అధికారి సబిత, అనితారెడ్డి వినతులు స్వీకరించారు.

వరంగల్‌లో 18 అభ్యర్థనలు

వరంగల్ రూరల్: వరంగల్ కలెక్టరేట్‌లో దివ్యాంగుల ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, వ్యక్తిగత రుణాల మంజూరు, అంత్యోదయ, దళితబంధు, సీనియర్ సిటిజన్‌తో పాటు, ఇతర సమస్యలపై 18 అభ్యర్థనలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, డీపీఎం పరమాత్మ, జిల్లా లీడ్ మేనేజర్ రాజు హవేలి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- ఉత్సవాలకు కాజీపేట చైతన్యపురి కాలనీలోని వెంకన్న ఆలయం ముస్తాబు
- 29నుంచి మార్చి 5వ తేదీ వరకు కొనసాగనున్న వేడుకలు
- భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు



చైతన్యపురి కాలనీలోని స్వాగత తోరణం



వేంకటేశ్వరస్వామి దేవాలయం

కాజీపేట: కాజీపేట చైతన్యపురి కాలనీలోని పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం.. 21వ బ్రహ్మోత్సవ వేడుకలకు అందంగా ముస్తాబవుతోంది. ఈనెల 28నుంచి మార్చి 5వ తేదీ వరకు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. నగరం నలుమూలల నుంచి భక్తులు వేడుకలకు హాజరవుతారు. వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఆలయంలో తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. నిట్ ఎదురుగా ఉన్న చైతన్యపురి కాలనీలో పేదల తిరుపతిగా పిలువబడే ఈ ఆలయంలో భక్తులు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయంలో కుంకుమ పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నమాచార్య సంగీత కచేరీలు వంటివి ప్రతి శనివారం ఆలయ మండపంలో జరుగుతాయి. ఆలయం ముందు భాగంలోని స్వాగత తోరణం చైతన్యపురి కాలనీకే ప్రత్యేక శోభగా నిలిచింది. ఆలయం వద్ద విశాల వసతులు, మండపం, ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అడుగిడగానే భక్తిపారవశ్యంతో భక్తులు తన్మయత్వం చెందేలా పచ్చని మొక్కలు, అందమైన గార్డెన్, ఫౌంటెన్స్ కనువిందు చేస్తున్నాయి.

బ్రహ్మోత్సవాల వివరాలు

28నుంచి మార్చి 5వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్‌గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్‌లతో పాటు సభ్యులు విడుదల చేశారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. 28న స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, రక్షబంధనం, అంకురార్పణ, 1న ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, లక్ష్మి అర్చన, 2న పూలంగిసేవ, అలివేలు మంగమ్మ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 3న హోమం, గరుడసేవ, 4న సహస్ర నామార్చనలు, డోలోత్సవం, 5న పూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, ముగింపు ఉత్సవాలుంటాయని పూజారి రఘురామాచార్యులు వెల్లడించారు.

ఎన్ని చట్టాలున్నా మహిళలకు రక్షణ లేదు



ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా రక్షణ లేకుండా పోయిందని ఐద్వా హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి సాంబరాజు శ్వేత ఆందోళన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని, షైఫ్‌తో పాటు అతనికి సహకరించిన వారిని కూడా శిక్షించాలని కోరారు. ఈమేరకు హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. అనంతరం ఐద్వా సౌత్ మండల అధ్యక్షురాలు బూడిద రాధ, కార్యదర్శి శ్వేత మాట్లాడారు. సుకర్ణ, విజయ, రాణి, ప్రేమలత, స్రవంతి, కవిత, సుజాత, లక్ష్మి, యశోద పాల్గొన్నారు.

అలాగే, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని గిరిజన ప్రజా సంఘాల ఐక్య వేదిక సమన్వయ కర్త జాటోతు కిషన్ ఒక ప్రకటనలో కోరారు.

కూరగాయలు సాగు చేసుకుంటాం..



వినతిపత్రం అందజేస్తున్న మహిళా ప్రతినిధులు

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ భూముల్లో కూరగాయల సాగు చేసుకుంటామని, అందుకు అనుమతి ఇవ్వాలని మహిళా సంఘాల ప్రతినిధులు కోరారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పదేళ్ల క్రితం అప్పటి జాయింట్ కలెక్టర్ వాకటి కరుణ.. ఎస్సారెస్పీ భూములను కూరగాయల సాగుకు కేటాయించారని గుర్తుచేశారు. అందులో ప్రభుత్వ నిధులను ఖర్చుచేసి బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కొంతకాలం ఆ భూముల్లో కూరగాయల సాగు కూడా చేసినట్లు చెప్పారు. అయితే కాలక్రమేణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో సాగుకు దూరంగా ఉన్నట్లు చెప్పారు. అయితే, ఆ భూములను కొంతమంది రియల్టర్లు కబ్జా చేశారని, ఈక్రమంలో సాగుకు వెళితే బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు.

కేయూలో కొనసాగుతున్న సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో సీఐటీయూ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం మూడోరోజు శనివారం కొనసాగింది. యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రాంతాల్లో దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగులు సంతకాలు సేకరించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి మాట్లాడుతూ ఆరేళ్లుగా దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగుల వేతనాలను పెంచలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాల చట్టం జీఓ నంబర్ 60ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కేయూ సీఐటీయూ అధ్యక్షుడు రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, బాధ్యులు పల్లం రాజు, మధు, రాజు, వెంకటేశ్వర్లు, బతుకమ్మ, కల్పన, విజేందర్, నాగార్జున, వినోద్ పాల్గొన్నారు.

ఏకశిల పార్కు అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహకారంతో పార్కు సిబ్బంది సంక్షేమంతో పాటు పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో ఏకశిల చిల్డ్రన్ పార్కును మరింతగా అభివృద్ధి చేస్తానని పార్కు నిర్వాహకుడు తీగల శ్రీధర్‌గౌడ్ అన్నారు. ఖిలా వరంగల్ మధ్యకోటలో ఏకశిల చిల్డ్రన్ పార్కులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 12న పార్కు నిర్వహణకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పర్మిషన్ ఇచ్చిందని చెప్పారు. ఏడాదికి రూ.18 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. పార్కులో పనిచేసే 11 మంది సిబ్బందికి సరైన వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని వివరించారు. కొంతమంది చేసే అసత్య ఆరోపణలను నమ్మకూడదని కోరారు. సమావేశంలో గంద్రాతి రమేష్, బైరబోయిన నాగరాజు, అజ్మల్ సోహేల్ తదితరులు పాల్గొన్నారు.

'బండి' బ్రేక్ ఫాస్ట్.. 'ఈటల' లంచ్



ప్రదీప్‌రావు ఇంట్లో లంచ్ చేస్తున్న రాజేందర్



రవికుమార్‌ను పరామర్శిస్తున్న బండి సంజయ్

కాశిబుగ్గ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నగర పర్యటనకు వచ్చారు. ఈక్రమంలో వారిద్దరు పార్టీ జిల్లా నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెలి ప్రదీప్‌రావు ఇంట్లో ఆతిథ్యం స్వీకరించారు. శనివారం ఉదయం ఓసిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో బండి సంజయ్ బ్రేక్‌ఫాస్ట్ చేయగా, మధ్యాహ్నం ఈటల రాజేందర్ లంచ్ చేశారు. వారి వెంట పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, నాయకులు ఉన్నారు.

రవికుమార్‌కు బండి సంజయ్ పరామర్శ

ఖిలా వరంగల్: శివనగర్‌కు చెందిన తూర్పు నియోజకవర్గ బీజేపీ నేత గంట రవికుమార్.. తొంటి సమస్య (ఏవీఎన్)తో బాధపడుతున్నారు. ఈమేరకు రవికుమార్‌ను శివనగర్‌లోని ఆయన స్వగృహంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మురళీధర్ గౌడ్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి బండి సంజయ్ శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పుప్పాల రాజేందర్, యోగానంద్, కందిమల్ల మహేష్, సంపత్‌రావు, క్రాంతి పాల్గొన్నారు.

ఇసుక లోడ్ లారీ సీజ్

ఖిలా వరంగల్: ఏటూర్‌నాగారం, మంగపేట మండలాల నుంచి వరంగల్ నగరానికి అక్రమంగా ఇసుకను తరలించే లారీని పోలీసులు, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా శనివారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు, వేబిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని అధికారులు గుర్తించి సీజ్ చేసి ఆర్టీఏ ప్రాంగణానికి తరలించారు.

వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీ..

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. వావివాల వాగు నుంచి ఇసుకను లారీలో నగరానికి తరలిస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

డైరీతో అనేక ఉపయోగాలు

హన్మకొండ: దైనందిన జీవితంలో డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో గోపాల్‌రావు, డైరెక్టర్లను తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం కలిసి అసోసియేషన్ డైరీని అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరావు, పి.మోహన్ రెడ్డి, పి.గణపతి, వి.తిరుపతి రెడ్డి, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ సెక్రటరీ బి.దానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఉపేందర్, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు వస్కుల కృష్ణ, రాజారపు చలపతి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చీఫ్‌విప్

కేయూ క్యాంపస్: క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్వీ), కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్తంగా హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈనెల 17నుంచి నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా శనివారం ఫైనల్ మ్యాచ్‌ను చీఫ్‌విప్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రతీఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసుకునేందుకు ఇదొక మంచి వేదికగా అని అన్నారు. కాగా, ఫైనల్ మ్యాచ్‌లో 47వ డివిజన్ జట్టు, 7వ డివిజన్ జట్లు తలపడగా 7వ డివిజన్ జట్టు విజయం సాధించి కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. 47వ డివిజన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు వినయ్‌భాస్కర్‌తో కలిసి అంతర్జాతీయ క్రీడాకారిణి శోభ, మరో అంతర్జాతీయ క్రీడాకారిణి నాగమణి బహుమతులు అందజేశారు.

సాధనతో సాధించలేనిదేదీ లేదు



విద్యార్థులతో మాట్లాడుతున్న బరుపాటి గోపి

విద్యారణ్యపురి: సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదని ప్రముఖ మనస్తత్వ వేత్త, రచయిత బరుపాటి గోపి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం ప్రేరణ సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంలో ప్రతీఒక్కరికీ సమయం ఒక్కటేనని, అయితే ఆ సమయాన్ని వాడుకోవటంలోనే విజయం దాగుందని వివరించారు. పోటీ ప్రపంచంలో కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయులు వల్సపైడి, అన్వర్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓసిటీ స్టేడియంలో చెస్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ సీఈఓ రజనీకాంత్

కాశిబుగ్గ: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ ఇండోర్ స్టేడియంలో అండర్ -17 బాలబాలికల చెస్ పోటీలను శనివారం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో శ్రీవాస్తవ్, వసంత్‌సాయి, బాలికల విభాగంలో ప్రణవి, లక్ష్మీశ్రావణిలు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వారు రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో వరంగల్ తరఫున ఆడుతారని అసోసియేషన్ సీఈఓ రజనీకాంత్ తెలిపారు. అనంతరం, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కాశిబుగ్గ: విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని, అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని గుడిబడి హెచ్‌ఎం కుంట రవికుమార్ అన్నారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలు, పుస్తకాలు, ఉపాధ్యాయ బృందం దారి చూపుతాయని, ఈక్రమంలో విద్యార్థులు ఆ దారిలో నడుస్తూ తమ లక్ష్యాలను చేరుకోవాలని వివరించారు. అనంతరం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్, సునితాదేవి, సుదాబిందు, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ గోవిందుడు పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వేలం పాటలో రింగ్!

- కొబ్బరికాయల టెండర్ వాయిదా



హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం టెండర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ షాపులకు వేలం పాడారు. అయితే, కొబ్బరికాయల టెండర్‌కు ముగ్గురు వ్యాపారులు మాత్రమే వచ్చారు. ఆ ముగ్గురు రింగ్ అయి టెండర్ పాటను ముందుకు సాగనివ్వలేదు. గతేడాది రూ.1.51 లక్షల వేలం.. ఈ ఏడాది రూ.86 వేలకు ముగించారు. ఈక్రమంలో వ్యాపారులు రింగ్ అయినట్లు దేవస్థానం అధికారులు గుర్తించారు. దీంతో కొబ్బరికాయల టెండర్ ప్రక్రియను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేశారు. గతేడాది పలికిన 1.51 లక్షల వేలానికే టెండర్ ఇవ్వాలని దేవస్థాన పాలకవర్గం నిర్ణయించింది. లేకుంటే దేవస్థానం ఆధ్వర్యంలో కొబ్బరికాయలు షాపు నిర్వహించాలని యోచిస్తోంది.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మడికొండ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలు, నాయకులకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మరావు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలో శనివారం సాయంత్రం డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పానగొటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, బైరి సతీష్, తాటిరెడ్డి రవీందర్‌రెడ్డి, బైరపాక వెంకటేష్, బుర్ర నరేష్, గడ్డం కిరణ్, పల్లపు యుగేందర్, అశోక్, వల్లెపు రేణుక, సభ్యులు పాల్గొన్నారు.

టీబీపై విద్యార్థులకు అవగాహన

విద్యారణ్యపురి: హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీబీపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ టీబీ వచ్చిన వారికి ఔషధాలతోపాటు పౌష్టికాహారం కోసం ప్రతినెల రూ.500 కూడా ఇస్తున్నట్లు చెప్పారు. టీబీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కిరణ్, బ్రేకింగ్ ది బ్యారియర్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామకృష్ణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తమను తాము రక్షించుకోవాలి



మడికొండ: నేటి రోజుల్లో ఆడపిల్లలు తమని తాము రక్షించుకోవాలని దుర్గాబాయి మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ సూచించారు. మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డైరెక్టర్ రవి సమక్షంలో శిక్షణ పొందుతున్న డీడీయూ – జీకేవై, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, ఏఏఎం విద్యార్థినులు, విద్యార్థులకు పది రకాల టెక్నిక్‌లను శనివారం నేర్పించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

వృద్ధుడిని చూసి చలించిపోయిన చీఫ్‌విప్

హన్మకొండ: వృద్ధ వయస్సులో రిక్షా తొక్కుతున్న వ్యక్తిని చూసి చలించిపోయిన ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ వెంటనే తన వాహనాన్ని నిలిపి అతని వద్దకు చేరుకుని పలకరించారు. కుటుంబ పోషణకు ఆర్థిక చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందించేందుకు వెళ్తున్న క్రమంలో వృద్ధుడు సారయ్య చీఫ్‌విప్‌కు తారసపడ్డాడు.

అనాథాశ్రమానికి పడకల అందజేత



హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమానికి పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థ మంచాలు అందించింది. ఆశ్రమంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 40మంచాలను ఆశ్రమ వ్యవస్థాపకుడు ఒద్దిరాజు చంద్రప్రకాష్‌కు ప్యూర్ సంస్థ వ్యవస్థాపకురాలు శైలజ అందించారు. ఈమేరకు శైలజకు చంద్రప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

అంత్యోదయ కార్డు ఇప్పించండి



ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ నాగమయ్య గుడి లేన్ ఎస్సీ కాలనీలో శనివారం జరిగిన బీజేపీ శక్తి కేంద్రం, కార్నర్ మీటింగ్‌కు బీజేపీ నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావును ఉర్సు కరీమాబాద్ ప్రతాప్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడైన రామగిరి గణేష్ అలియాస్ శ్యాం కలిశాడు. తనకు 35కిలోల అంత్యోదయ రేషన్ కార్డు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఇప్పించేలా కృషి చేస్తానని దివ్యాంగుడికి ప్రదీప్‌రావు హామీ ఇచ్చారు.

యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా బాబుయాదవ్



హన్మకొండ: అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా మేరుగు బాబుయాదవ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలో ఈనెల 24వ తేదీన జరిగిన కార్యక్రమంలో హనుమకొండ నయీంనగర్ శ్రీనగర్ కాలనీకి చెందిన బాబుకు మహేష్‌యాదవ్ నియామక పత్రం అందించారు.

ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా లింగంపల్లి నానాజీ



హన్మకొండ: ఆరెకుల సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా లింగంపల్లి నానాజీ ఎన్నికయ్యారు. ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో ఆరెకుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు.